సాక్షి సూర్యాపేట

మంగళవారం : 12 : నవంబర్ : 2024



కల్లాల బాట పట్టండి

సీఎం, మంత్రులు రైతుల కల్లాల బాట పట్టాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ సూచించారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 587.10 అడుగులు
ఇన్‌ఫ్లో	: 33,259 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 33,259 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 16,849
కుడికాల్వ ద్వారా	: 10,120 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 3,490 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 643.89 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 429.27 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 369.47 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

13న సదరం క్యాంపు

భానుపురి (సూర్యాపేట) : సదరం సర్టిఫికెట్ కలిగి ఉండి నవంబర్‌లో గడువు ముగిసే వారు రెన్యువల్ కోసం మీ సేవా కేంద్రాలు, జిల్లా డీఆర్‌డీఏ కార్యాలయంలో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి అప్పారావు సోమవారం తెలిపారు. స్లాట్ బుక్ అయిన వారంతా మీసేవా కేంద్రాల్లో జారీచేసే రశీదులోని క్యాంపు తేదీ ప్రకారం ఈనెల 13, 20, 27న ఏరియా ఆస్పత్రిలో ఉదయం 9గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి



రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

పెన్‌పహాడ్ : రైతులు ముందు జాగ్రత్తలు పాటించి పశువుల్లో వ్యాధులను అరికట్టాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెన్‌పహాడ్ మండలంలోని పొట్లపహాడ్‌లో పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. పశువుల్లో ఉత్పాదకతను పెంచే మినరల్ మిక్చర్ ప్యాకెట్లను రైతులకు అందజేశారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మోతె: మండలంలోని మామిళ్లగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో పాటు మహిళా టీచర్లపై వేధింపులకు పాల్పడుతున్న ఉపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాసరెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఈఓ అశోక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహిళా వేధింపులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం స్త్రీ,శిశు సంక్షేమ శాఖ సిబ్బంది మామిళ్లగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. దీంతో ఉపాధ్యాయుడు తమతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. వారు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో విచారణ చేయాలని డీఈఓను ఆదేశించారు. విచారణ అనంతరం ఆరోపణలు నిజమని తేలడంతో సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.

మండల పరిషత్ కార్యాలయంలో సబ్‌కోర్టు



పూజలు నిర్వహిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి

కోదాడరూరల్: కోదాడ సబ్ కోర్టు కార్యకలాపాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని పై అంతస్తులో తాత్కాలికంగా నిర్వహించనున్నారు. ఈమేరకు సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి సురేష్, జూనియర్ సివిల్ జడ్జి భవ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుత భవనం సరిపోకపోవడం, వర్షం వస్తే ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున నూతన కోర్టు భవన నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు ఇక్కడే కోర్టు కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఆర్‌కె మూర్తి, న్యాయవాదులు పాల్గొన్నారు.

టీపీటీయూ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

సూర్యాపేటటౌన్ : టీపీటీయూ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీపీటీయూ కార్యాలయంలో జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడిగా చిలుక శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడిగా నిమ్మల శ్రీనివాస్, సహ అధ్యక్షులుగా ముంత శ్రీనివాస్, పద్మ, అరుణ, ఉపాధ్యక్షులుగా సైదులు, ధర్మయ్య, స్వరూప, ప్రధాన కార్యదర్శిగా కడపర్తి శ్రీనివాస నాయుడు, ఆర్థిక కార్యదర్శిగా గుణగంటి కృష్ణతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో టీపీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మట్టపల్లి రాధాకృష్ణ, ఎన్నికల పరిశీలకులు నాగయ్య, వివిధ మండలాల బాధ్యులు ఉదయ్, కేశయ్య. ఉపేందర్ వషన్న, రమేష్, వీరన్న, బోసు పాల్గొన్నారు.

రేపటి నుంచి టోకెన్ విధానం

మిర్యాలగూడ : వాకానాలం సీజన్ ధాన్యం విక్రయాలు రైస్ మిల్లుల వద్ద సాఫీగా సాగేందుకు ఈనెల 13 నుంచి టోకెన్ విధానాన్ని అమలు చేయనున్నట్లు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోజూ మూడు వేల ట్రాక్టర్ల ధాన్యానికి టోకెన్లను జారీ చేస్తామన్నారు. సూర్యాపేట జిల్లా రైతులకు 1200, మిర్యాలగూడ పరిసర రైతులకు 1800 టోకెన్లు అందజేస్తామని తెలిపారు.

సన్నాలు.. సవాలక్ష కష్టాలు

మద్దతు ధరకు మంగళం పాడుతున్న మిల్లర్లు

- ధాన్యం క్వింటాకు రూ. 2150 నుంచి రూ. 2400 వరకే చెల్లింపు
- జిల్లాలో సన్నాల కొనుగోలుకు 80 కేంద్రాల ఏర్పాటు
- 17 శాతం తేమ ఉండాలని నిబంధన
- ఇప్పటి వరకు ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయని ప్రభుత్వం
- విధిలేక మిల్లులను ఆశ్రయించి నష్టపోతున్న అన్నదాతలు



రైస్ మిల్లు వద్ద బారులుదీరిన ధాన్యం ట్రాక్టర్లు



ఈ ఫొటోలోని రైతు పేరు యల్క ప్రభాకర్ రెడ్డి. చివ్వెంల మండల కేంద్రానికి చెందిన ఈయన తనకున్న 8 ఎకరాల్లో సాంబ మసూరి ధాన్యం పండించాడు. సుమారు 300 బస్తాలు గత వారం రోజుల క్రితం మండల పరిధిలోని వట్టి ఖమ్మంపహాడ్ గ్రామంలోని ఐకేపీ కేంద్రానికి తీసుకువచ్చాడు. ఇప్పటివరకు అధికారులు, నిర్వాహకులు ఎవరూ ధాన్యాన్ని పరిశీలించలేదు. నిర్వాహకులను అడిగితే చూస్తాం.. కాంట వేస్తాం అంటున్నారే తప్ప పట్టించు కోవడం లేదు. రహదారిపై పోయడంతో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే కప్పడానికి తీసుకువచ్చిన పట్టాలకు ప్రతి రోజూ రూ.300 నుంచి రూ.400 వరకు కిరాయి అవుతోంది.

బోనస్ పడ్డాకే అమ్ముతా



10ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. 15రోజుల క్రితం 30 డబ్బాల సన్న ధాన్యాన్ని కుక్కడం ఐకేపీ కొనుగోలు కేంద్రంలో పోశా. ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తానని ప్రకటించినప్పటికీ ఇస్తుందో లేదోనని అనుమానంగా ఉంది. మద్దతు ధర డబ్బులు ఒకసారి, బోనస్ డబ్బులు మరోసారి వేస్తామని చెప్పేసరికి ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఎవరికైనా బోనస్ డబ్బులు పడ్డాకే ధాన్యం అమ్ముతా.

– దరావత్ భాస్కర్, రైతు, కుక్కడం ఆవాసం దేవ్లా తండా

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : సన్న ధాన్యం పండించే రైతులకు మిల్లర్లు చుక్కలు చూపిస్తున్నారు. రకరకాల కొర్రీలు పెట్టి ధరను పూర్తగా తగ్గిస్తున్నారు. కోతలు ప్రారంభమైన సమయంలో క్వింటాకు రూ.2,500 పైచిలుకు చెల్లించి కొనుగోలు చేసిన మిల్లర్లు.. ఇప్పుడు ధాన్యం అధికంగా వస్తుండటంతో ధరను పూర్తగా తగ్గించారు. క్వింటాకు రూ.2,150 నుంచి రూ.2,400 మించి చెల్లించడం లేదు. కొందరికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.2,320 కూడా చెల్లించడం లేదు. అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ధర తగ్గిస్తున్నారని ఆగ్రహించిన అన్నదాతలు ఆదివారం మిర్యాలగూడలోని మిల్లుల ఎదుట ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అక్కడి మిల్లులను తనిఖీ చేశారు. మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అమ్ముకునేందుకు అవస్థలు..

ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. దొడ్డు ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండగా.. సన్నాలను మాత్రం మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈసారి సన్నాలను కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం జిల్లాలో 80 ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కేంద్రాల్లో అమ్ముకునేందుకు రైతులు పెద్దగా ఆసక్తి చూడం లేదు. ఆయకట్టేతర ప్రాంతాల్లో కొన్ని చోట్ల మాత్రమే ధాన్యం కేంద్రాలకు వచ్చింది. కానీ ఎక్కడా ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు నేరుగా మిల్లర్ల వద్దకే వెళ్తున్నారు. ఇదే అదునుగా భావించి మిల్లర్లు ధరలో కోత పెడతూ నిలువు దోపిడీ చేస్తున్నారు.

తేమ 17 శాతం ఉండాలని నిబంధన

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం 17 శాతం తేమ వస్తేనే కొనుగోలు చేయాలని నిబంధన ఉంది. అలా తెచ్చిన ధాన్యానికి మద్దతు ధరపై రూ.500 బోనస్ కూడా ఇస్తామని ప్రకటించింది. కానీ మిల్లుల్లో అయితే నేరుగా కొనుగోలు చేస్తారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో ధాన్యాన్ని ఆరబెట్టడం రైతులకు ఇబ్బందిగా మారుతోంది. దీంతో మిల్లర్లు చెప్పిన రేటుకే విక్రయించి నష్టపోతున్నారు.

అబుల్ కలాం సేవలు ఆదర్శనీయం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



అబుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట): మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు ఆదర్శనీయమని, విద్యా వ్యవస్థలో మార్పులు తెచ్చిన మహనీయుడని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. అనంతరం మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూర్యాపేటలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీడబ్ల్యూఎంఓ జగదీశ్‌రెడ్డి, డీఎఫ్ఓ సతీష్ కుమార్, డీఆర్‌డీఓ అప్పారావు, డీఎంహెచ్ఓ కోటాచలం, డీఈఓ అశోక్, సీపీఓ కిషన్ పాల్గొన్నారు.

కుటుంబ సర్వేను వేగవంతం చేయాలి

ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు జాగ్రత్తగా సర్వే ఫారాలను నింపాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 54,626 గృహాలను సర్వే చేయడం జరిగిందన్నారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖల సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ నివేదిక పంపాలన్నారు. హాజరు శాతం సరిగా లేని వారి పనితీరును సమీక్షించాలన్నారు. జిల్లాలో చదువు రాని వారిని గుర్తించడం జరిగిందని, మొదటి దశగా 27,840 మందికి వలంటీర్స్ ద్వారా చదువు నేర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు జగదీశ్ రెడ్డి, సతీష్ కుమార్, వి.అప్పారావు, కోటాచలం, అశోక్, ఎల్.కిషన్, శంకర్, శ్రీధర్ రెడ్డి, పద్మజ, లత, శ్రీనివాస్, సీతారాం నాయక్, శ్రీనివాస్‌నాయక్, శ్రీనివాస్, నరసింహారావు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మట్టిని తరలించొద్దు

సాక్షి ఎఫెక్ట్..



మామిడాలలోని ప్రభుత్వ భూమిలో కందకాలు తీయిస్తున్న తహసీల్దార్ హరిప్రసాద్

తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా మట్టి తీయొద్దని తిరుమలగిరి తహసీల్దార్ బి.హరిప్రసాద్ హెచ్చరించారు. మట్టి అక్రమ తరలింపుపై ఈ నెల 10న సాక్షి దినపత్రికలో 'అనుమతులు లేకుండానే' శీర్షికన కథనం ప్రచురించడంతో జిల్లా అధికారుల ఆదేశానుసారం సోమవారం మామిడాలలోని సర్వే నంబర్ 107లో గల ప్రభుత్వ భూమిని తహసీల్దార్ హరిప్రసాద్ పరిశీలించారు. జేసీబీ సాయంతో ప్రభుత్వ భూమిలోకి వెళ్లకుండా కందకాలు తవ్వించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో మట్టి తీయాలంటే అనుమతులు తీసుకోవాలన్నారు. అక్రమంగా మట్టి తీసినందుకుగాను ఈ నెల 1న నాలుగు టిప్పర్లపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమించినా, మట్టి, మొరం తీసినా కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ సుజిత్‌రెడ్డి, సర్వేయర్ జోసెఫ్ ఉన్నారు.

ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : ఏడాది పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయ్యిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని వర్గాలను మోసం చేస్తూ , వైఫల్యాలపై గొంతెత్తుతున్న వారిని అణిచివేసేందుకు మాత్రమే పోలీస్ శాఖ పని చేస్తోందన్నారు. కాంగ్రెస్ సంవత్సర పాలనలో పరిస్థితులు తారుమారయ్యాయన్నారు. అభివృద్ధి ఆగి ప్రభుత్వ శాఖలన్నీ పడకేశాయన్నారు. సాగు నీరు లేక , మద్దతు ధర లేక రైతులు రోడ్డెక్కి ప్రభుత్వం పై తిరుగుబాటు చేస్తున్నారని, కొత్తగా ఇళ్లు నిర్మించేది పోయి ఉన్నవి కూలగొడుతున్నారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం దళారులకు కొమ్ముకాస్తున్నట్లుగా ఉందన్నారు. చివరి గింజ వరకు మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వికారాబాద్ ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా స్థానికులు అధికారులను ప్రతిఘటిస్తున్నారన్నారు. వికారాబాద్‌లో ప్రభుత్వ దుర్మార్గాన్ని ఎదిరించి ఆత్మరక్షణకు రైతులు దాడులకు దిగాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ పరిపాలనకు వికారాబాద్ దాడి ఘటనే నిదర్శనమన్నారు. రైతుల దగాపై ప్రభుత్వ కుట్రను త్వరలోనే బయటపెడతామన్నారు. త్వరలోనే నల్లగొండ మంత్రి సహా సీఎం వరకు అందరి బండారం బయటపెడతామని చెప్పారు. మూసీ కంటే దుర్గంధమైన నోరుతో కేసీఆర్‌ని దూషిస్తున్నారని, అడ్డగోలుగా దూషిస్తే విసునూరు గడిలో శత్రువుల నోట్లో దుర్గంధం పోసినట్లు మీ నోళ్లల్లో మూసీ నీళ్లు పోయడం ఖాయమని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారంతో కాంగ్రెస్‌కు ఇక చివరి రోజులేనని చెప్పారు.

ఇచ్చిన హామీలు మరిచిన ప్రభుత్వాలు



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

పాలకవీడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను మోసం చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. సోమవారం పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో నిర్వహించిన మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు మరిచిందన్నారు. ధాన్యం విక్రయాల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని యాసంగి సీజన్‌లో సన్న ధాన్యాన్ని రూ.3000లకు కొనుగోలు చేసిన మిల్లర్లు, ఈ సీజన్‌లో రూ.2200 లు చెల్లిస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారన్నారు. అనంతరం దిద్దకుంట్ల రాంరెడ్డి, గుండ్ర శంబిరెడ్డిలను సీపీఎంలోకి ఆహ్వానించారు. సమావేశంలో మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్, తరికొండ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శేఖర్‌రావు, నగేష్, వెంకట్‌రెడ్డి, సైదులు, పాండునాయక్, మండల కార్యదర్శి బాలునాయక్, మట్టేష్, ధనమూర్తి, పురుషోత్తంరెడ్డి, మల్లారెడ్డి, వీరభద్రం, వెంకటయ్య పాల్గొన్నారు.

పిల్లలమర్రిలో కార్తీక పూజలు



కార్తీక మాసం సందర్భంగా సోమవారం పిల్లలమర్రిలోని ఎరకేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

పేట మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం



ధాన్యం రాశులతో కళకళలాడుతున్న సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డు

- ఒక్కరోజే 52వేల బస్తాల రాక
- ఈ సీజన్‌లో ఇదే అత్యధికం
- ఎగుమతుల దృష్ట్యా నేడు సెలవు ప్రకటించిన అధికారులు

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు వరి ధాన్యం పోటెత్తింది. సోమవారం ఒక్కరోజే 52వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. ఈ వానాకాలం సీజన్‌లో ఈ స్థాయిలో ధాన్యం రావడం ఇదే తొలిసారి. జిల్లాలో కోతలు ముమ్మరంగా సాగుతుండగా.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇంకా కాంటాలు పూర్తిస్థాయిలో సాగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో అసలు మిల్లుల కేటాయింపులే జరగలేదు. సెంటర్లు ఇప్పటికే నిండిపోగా.. పొలాలు కోస్తున్న రైతులు ఈ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు కాకుండా నేరుగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకువస్తున్నారు.

ఆదివారం సెలవు కావడంతో..

వానాకాలం సీజన్‌లో సూర్యాపేట మార్కెట్ యార్డుకు ఈ స్థాయిలో ధాన్యం రావడం ఇదే తొలిసారి. గతంలో 60వేల బస్తాల ధాన్యం వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఏటా 40వేల బస్తాలకు మించి ధాన్యం వరుసగా వస్తే అధికారులు టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టేవారు. శుక్రవారం మార్కెట్‌కు 36,257, శనివారం 40,072 బస్తాల ధాన్యం.. ఆదివారం మార్కెట్ యార్డుకు సెలవు కావడంతో సోమవారం 52,449 బస్తాల ధాన్యం (34,093 క్వింటాలు) వచ్చింది. ఇందులో అత్యధికంగా జైశ్రీరాం రకం 37,069 బస్తాలు, హెచ్ఎంటీలు 7860 బస్తాలు, ఐఆర్ -64లు 5170 బస్తాలు, బీపీటీలు 2249 బస్తాలు, బీపీటీ పాతవి 80 బస్తాలు, హెచ్ఎంటీలు పాతవి 21 బస్తాల ధాన్యం మార్కెట్‌కు అమ్మకానికి రైతులు తీసుకొచ్చారు. ఈ ధాన్యంలో బీపీటీ పాత వాటికి రూ.2649ల గరిష్ఠ ధర, 1,926 కనిష్ఠ ధరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. జైశ్రీరాం రకానికి గరిష్ఠ ధర రూ.2,464లు, కనిష్ఠ ధర రూ.1,503 ఉంది.

నేడు మార్కెట్‌కు సెలవు

మార్కెట్ యార్డుకు భారీగా ధాన్యం రావడంతో ఎగుమతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ముందస్తుగా మంగళవారం యార్డుకు సెలవు ప్రకటించారు. ఎగుమతులు పూర్తికాకుండానే రైతులు యార్డుకు ధాన్యం తీసుకొస్తే ఇబ్బందులు వస్తాయని భావించి వ్యాపారుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

నాడు కాంట్రాక్ట్ అన్నారు.. నేడు దినసరి కూలీలంటున్నారు

- మూడేళ్ల కిందట కోదాడ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సిబ్బంది నియామకం
- కార్మికుల వేతనాల చెల్లింపు నిలిపివేత
- అనుమతి వస్తే తప్ప కొనసాగించలేమని చెప్పిన అధికారులు
- ఉద్యోగం కోసం లక్షల రూపాయలు ఇచ్చామని వాపోతున్న కార్మికులు



కోదాడ: కోదాడ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సిబ్బంది రోడ్డున పడ్డారు. మూడు సంవత్సరాల క్రితం మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోమని చెప్పడంతో అప్పులు చేసి ప్రజాప్రతినిధులకు లక్షల రూపాయలను సమర్పించుకున్నారు. తాజాగా మున్సిపల్ అధికారులు మీరు కేవలం దినసరి కూలీలు మాత్రమేనని, కాంట్రాక్ట్ ఉద్యోగులు కాదని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తమకు వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగులుగా గుర్తించాలని రెండు రోజులుగా పని మానేసి ధర్నాలు చేస్తున్నారు.

వేతనాల చెల్లింపు భారం కావడంతో..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హరితహారం కార్యక్రమం నిలిచిపోయింది. వీరికి వేతనాలు ఇవ్వడం మున్సిపాలిటీకి తలకు మించిన భారంగా మారింది. అంతే కాకుండా వీరిని కొనసాగించలేమని, కొనసాగిస్తే తమ ఉద్యోగాలు పోతాయని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం కోదాడ ఎమ్మెల్యే వీరి విషయంపై ఆరా తీయగా ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతి వస్తే తప్ప వీరిని కొనసాగించలేమని అధికారులు చెప్పినట్లు సమాచారం.

అసలేం జరిగిందంటే..

మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సిబ్బంది, వాహనాల డ్రైవర్లు సరిపోవడం లేదని వార్డుకు ఇద్దరు చొప్పున 70 మంది పారిశుద్ధ్య కార్మికులను, మరో 30 మంది డ్రైవర్లు, క్లర్కులను నియమించుకోవడానికి మున్సిపాలిటీ పాలకవర్గం తీర్మానించింది. అప్పటి ఎమ్మెల్యే కొంత మందిని సిఫార్సు చేయగా, ప్రతి కౌన్సిలర్ ఇద్దరు కార్మికులను తమ వార్డుల్లో నియమించుకున్నారు. ఈ సమయంలో కొంత మంది కార్మికుల నుంచి ఉద్యోగం పేరుతో లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. మున్సిపల్ ఉన్నతాధికారులు కొంత కాలం పాటు వీరిని తొలగించారు. తమను ఎలా తొలగిస్తారని కార్మికులు గొడవకు దిగడంతో మున్సిపాలిటీ ప్రత్యేక సమావేశం పెట్టి వీరికి సాధారణ నిధుల నుంచి వేతనాలు చెల్లించాలని, హరితహారం నిధుల కింద ఖర్చు చూపించి వేతనాలు ఇవ్వాలని అనధికారికంగా నిర్ణయం తీసుకొని కొనసాగిస్తూ వస్తున్నారు. అధికారులు పైకి ఏమి చెప్పకుండా వీరిని దినసరి కూలీలుగా పరిగణిస్తుండగా, కార్మికులు మాత్రం తాము కాంట్రాక్ట్ కార్మికులమనే భావిస్తున్నారు.

మూడు నెలల వేతనాలు ఇవ్వాలి

ధర్నా చేస్తున్న వారు మున్సిపల్ కార్మికులు కాదు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కూడా కాదు. వారు కేవలం దినసరి కూలీలు మాత్రమే. మున్సిపాలిటీ వద్ద నిధులు ఉంటే వేతనాలు ఇస్తాం. వారికి కేవలం మూడు నెలల వేతనాలు మాత్రమే ఇవ్వాలి. వారిని కొనసాగించాలంటే ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతి రావాలి.

– రమాదేవి, మున్సిపల్ కమిషనర్, కోదాడ

ముఖం చాటేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

వంద మంది కార్మికులు నెలల తరబడి వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నా కోదాడ మున్సిపల్ కౌన్సిలర్లు పట్టించుకోవడం లేదని, పిలిచినా రావడం లేదని కార్మికులు వాపోతున్నారు. తమ వద్ద తీసుకున్న డబ్బులను వడ్డీతో సహా చెల్లించాలని, లేకుంటే తమను ఉద్యోగాల్లో కొనసాగించే విధంగా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



అంజయ్య (ఫైల్)

ఆలేరురూరల్: హార్వెస్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. వివరాలు.. ఆలేరు మండలం శారాజీ పేట గ్రామానికి చెందిన ఆడెపు అంజయ్య(48) వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగి స్తున్నాడు. ఈ నెల 4వ తేదీన హార్వెస్టర్‌తో తన వరి పొలం కోయిస్తుండగా.. వెనుక ఉన్న అంజయ్యను హార్వెస్టర్ డ్రైవర్ గమనించకుండా రివర్స్ చేయడంతో వెనుక టైరు అతడి పైకి ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి

చింతపల్లి: హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండలం నసర్లపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్న గుర్తుతెలియని మహిళ సోమవారం తెల్లవారుజామున నసర్లపల్లి గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వయస్సు సుమారు 50ఏళ్లు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. నసర్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు కారు దగ్ధం



దగ్ధమైన కారు

రాజాపేట: ప్రమాదవశాత్తు కారు దగ్ధమైన ఘటన రాజాపేట మండలం పారుపల్లి గ్రామం శివారులో సోమవారం జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా నర్మెట మండలం వెల్దెండ గ్రామానికి చెందిన జహంగీర్‌రెడ్డి తన కారులో రాజాపేట మండలం రేణికుంట గ్రామంలో ఉంటున్న చెల్లెలి ఇంటికి వచ్చి ఆమెను తీసుకుని తిరిగి స్వగ్రామానికి పయనమయ్యాడు. మార్గమధ్యలో రాజాపేట మండలం పారుపల్లి గ్రామ శివారులోని కల్వర్టు వద్ద కారు నుంచి పొగలు రావడం గమనించి జనార్దన్‌రెడ్డితో పాటు తన చెల్లెలు, అల్లుడు కారులో నుంచి బయటకు వచ్చారు. అనంతరం ఒక్కసారిగా మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న ఫుట్‌పాత్ పక్కన చెట్ల పొదల్లో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణం నుంచి ఆలయానికి వెళ్లే పాత గోశాల సమీపంలోని రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న చెట్ల పొదల్లో వ్యక్తి మృతదేహ పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు నలుపు రంగు ప్యాంట్, కుడి చేతికి కడియం ధరించాడని, మృతదేహం పక్కన బీరు బాటిల్ లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో క్లూస్ టీం సహాయంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సదరు వ్యక్తి మృతిచెంది 10 నుంచి 15 రోజులు అయ్యి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం వద్ద స్థానిక మేస్త్రీల ఫోన్ నంబర్లు ఉన్నాయని పట్టణ సీఐ రమేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మూసీ యాత్ర కాదు.. కల్లాల బాట పట్టండి

- రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్
- చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

చౌటుప్పల్: సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, కాంగ్రెస్ నాయకులు మూసీ యాత్ర చేయడం కాదు.. తక్షణమే రైతుల కల్లాల బాట పట్టాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ సూచించారు. సీజన్ పూర్తికావొస్తుంటే ఇంకా ఎప్పుడు ధాన్యం కొనుగోళ్లు చేస్తారని ప్రశ్నించారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సోమవారం బీజేపీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. రైతులు, రైతు కూలీలతో మాట్లాడారు. ధాన్యాన్ని మార్కెట్‌కు ఎప్పుడు తీసుకువచ్చారు, ఇప్పటి వరకు ఎందుకు కొనుగోలు చేయలేదు, నిర్వాహకులు ఏమంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో అక్కడే ధాన్యాన్ని నిల్వ చేసుకున్న చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామానికి చెందిన చింతపల్లి పుల్లారెడ్డి ఎంపీ వద్దకు వెళ్లారు. 35 రోజుల క్రితం తాను ధాన్యాన్ని తీసుకొచ్చానని, వర్షాలకు పలుమార్లు ధాన్యం తడిస్తే ఆరబోసుకున్నానని, ఇప్పటి వరకు రూ.30వేల ఖర్చు వచ్చిందని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. రోజులు గడుస్తున్నా ధాన్యాన్ని కాంటా వేయడంలేదని, అడిగితే తాము కొనుగోలు చేయలేమని చెబుతున్నారని బోరున విలపించారు. దీంతో ఎంపీ లక్ష్మణ్ వెంటనే కొనుగోలు కేంద్రానికి సంబంధించి మాయిశ్చర్ తీసే ఏఈఓ, పీఏసీఎస్ సీఈఓ, ఉద్యోగులను పిలిచి రైతు చెబుతున్న విషయం వాస్తవమేనా అని అడిగారు. మాయిశ్చర్ రానందునే కాంటా వేయలేదని వారు చెప్పారు. తక్షణమే మాయిశ్చర్ తీయాలని ఆదేశించారు. సదరు రైతు ధాన్యం మాయిశ్చర్ తీయగా 15.8 రావడంతో కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతును ఏడిపించకుండా తక్షణమే ధాన్యానికి కాంటా వేయాలని, కాంటా అయ్యేంత వరకు తాము ఇక్కడే ఉంటామని ఆదేశించారు. దాంతో సదరు రైతు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అన్నీ ఇస్తున్నా రైతుల వద్ద వడ్లు కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి చేతకావట్లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడేమో అవసరం తీరాక మోసం చేశారని ధ్వజమెత్తారు. సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో దళారులకు పంటను అమ్ముకుంటున్నారని అన్నారు. రైతులకు అండగా ఉండేందుకే బీజేపీ బృందాలు కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, అధికార ప్రతినిధి పడమటి జగన్మోహన్ రెడ్డి, బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర నాయకులు దోనూరి వీరారెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, గుండెగోని భరత్, బండారు ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, బీజేపీ మున్సిపాలిటీ, మండల అధ్యక్షులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేష్, నాయకులు ముత్యాల భూపాల్‌రెడ్డి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, ఆలె చిరంజీవి తదితరులు ఉన్నారు.

రైతుల కోసం చేసింది శూన్యం

అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ సూచించారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు రైతు డిక్లరేషన్ అని ఎంతో కలరింగ్ ఇచ్చి ఇప్పుడు మోసం చేశారని ధ్వజమెత్తారు. రుణమాఫీ విషయంలో రైతులను దగా చేశారన్నారు. ఇంకా రాష్ట్రంలో 40లక్షల మంది రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. రైతాంగానికి మేలు జరిగే వరకు బీజేపీ తరఫున అండగా ఉంటామన్నారు.

కుల గణనకు, సంక్షేమ పథకాలకు సంబంధం లేదు

- బీసీ రిజర్వేషన్ల పెంపునకే సమగ్ర కుల గణన
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



కుల గణన చైతన్య సదస్సులో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ టౌన్: రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర కుల గణనకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఎలాటి సంబంధం లేదని, బీసీ రిజర్వేషన్ల పెంపు కోసమే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుల గణన నిర్వహిస్తోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం నల్లగొండలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు అధ్యక్షతన నిర్వహించిన కుల గణన చైతన్య సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల గణనలో బీసీ కులాల లెక్కలు తేలే సమయం ఆసన్నమైందని, బీసీ కులాల ప్రజలు తప్పనిసరిగా కుల గణనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కుల గణనకు వచ్చే ఎన్యుమరేటర్లకు ఆటంకం కలిగించే వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కుల గణనపై అగ్రవర్ణాల కుట్రను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కుల గణనపై కొందరు అపోహలు సృష్టించి ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల లెక్కలు తేలితే భవిష్యత్‌లో తమ పీఠాలకు ఎసరు వస్తుందన్న అక్కసుతో కొందరు అగ్ర కులాల వారు కుల గణనను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కుల గణనపై ప్రజలను చైతన్యం చేయడానికి అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు 15రోజుల పాటు సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని కుల సంఘాల అధ్యక్షులు కూడా ఆయా కులాలను చైతన్యం చేసి కుల గణనలో పాల్గొనేలా చూడాలని, ప్రభుత్వం కూడా మీడియా ద్వారా అవగాహన కల్పించాలని కోరారు. ఈ సదస్సులో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, నాయకులు కంది సూర్యనారాయణ, నల్ల సోమమల్లయ్య, శంకర్‌ముదిరాజ్, రమేష్, జనార్దన్, రాజు, నర్సింహ, మధు పాల్గొన్నారు.

సకాలంలో చీడపీడల నివారణ చర్యలు చేపట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

త్రిపురారం: వివిధ రకాల పంటల సాగులో వాతావరణ మార్పులకు అనుగుణంగా వచ్చే చీడపీడలను రైతులు సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడులు వస్తాయని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం త్రిపురారం మండలంలోని కంపాసాగర్‌లో గల కృషి విజ్ఞాన కేంద్రం ఎస్సీ సబ్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని రైతులకు చీడపీడల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో చీడపీడల గుర్తింపు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కేవీకే శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. పంటల సాగులో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు ఉచితంగా జేజీఎల్ 24423 వరి విత్తనాలు అందించి వంగడం లక్షణాలు, కలుపు నివారణ, చీడ పీడల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రాములమ్మ, విస్తరణ శాస్త్రవేత్త పల్లవి, రైతులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక ల్యాబ్‌టెక్నీషియన్ ఆత్మహత్య

- న్యాయం చేయాలని మృతురాలి బంధువుల ఆందోళన



కిరణ్మయి (ఫైల్)



మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

సూర్యాపేటటౌన్: ఆస్పత్రి సిబ్బంది వేధింపులు భరించలేక లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రి ల్యాబ్ టెక్నీషియన్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం జరిగింది. మృతురాలి తల్లిదండ్రులు, భర్త తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చంద్రన్నకుంటకు చెందిన కొత్తపల్లి కిరణ్మయి (30) జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ కం కంప్యూటర్ ఆపరేటర్‌గా మూడు నెలలుగా పనిచేస్తోంది. ఆమె భర్త ప్రవీణ్ జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రి ఇన్‌చార్జి పవన్ రెండు నెలలుగా కిరణ్మయిని లైంగికంగా, మానసికంగా వేధిస్తుండడంతో పాటు ఏ పని సక్రమంగా చేయడంలేదని ఆమెను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అతడి వేధింపులు భరించలేక కిరణ్మయి సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్య చేసుకునే ముందు కిరణ్మయి భర్తకు ఫోన్ చేసి విషయం చెప్పింది. ఆయన ఇంటికి వచ్చేసరికి కిరణ్మయి ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. కిరణ్మయి మృతికి కారణమైన లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రి ఇన్‌చార్జి పవన్‌తో పాటు మరో ముగ్గురు ఆస్పత్రి సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం జరిగే వరకు వెళ్లేది లేదని రాత్రి వరకు అక్కడే కూర్చున్నారు. కాగా ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సూర్యాపేట పట్టణ పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని మహిళ బలవన్మరణం

వలిగొండ: కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వలిగొండ మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండల కేంద్రానికి చెందిన గొలుసుల కనకమ్మ(42)కు పెంటయ్యతో 25 సంవత్సరాల క్రితం రెండో వివాహం జరిగింది. వీరికి సంతానం లేదు. కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన కనకమ్మ సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికే చెందిన గుంజ ఆంజనేయులు అనే వ్యక్తి గమనించి కనకమ్మ కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయగా.. వారు వచ్చి ఉరికి వేలాడుతున్న కనకమ్మను కిందికి దించగా, అప్పటికే ఆమె మృతిచెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన డీసీఎం

- డ్రైవర్ మృతి



డివైడర్ పైకి ఎక్కిన డీసీఎం

ఆలేరురూరల్: వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆలేరు పట్టణంలోని బైపాస్ రోడ్డులో డీసీఎం అదుపుతప్పి డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన వెంకట సీతారామ్(40) డీసీఎం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు డీసీఎంలో వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఆలేరు పట్టణంలోని బైపాస్ రోడ్డుపై బ్రిడ్జి వద్దకు రాగానే డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సీతారామ్ డీసీఎంలో నుంచి ఎగిరి ఈదులమ్మ వాగులో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. అతివేగంగా డీసీఎం నడపడంతోనే ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రజీకర్ తెలిపారు.

చెర్వుగట్టులో ప్రత్యేక పూజలు

నార్కట్‌పల్లి: కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా నార్కట్‌పల్లి మండల పరిధిలోని చెర్వుగట్టులో గల పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గట్టు పైన, ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జాం కావడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో ఈఓ నవీన్‌కుమార్, దేవాలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ,, సీనియర్ అసిస్టెంట్లు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, వంశీ, అర్చకులు శ్రీకాంత్, సురేష్, సతీష్, నాగయ్య తదితరులు ఉన్నారు.



కార్తీక దీపాలు వెలిగిస్తున్న అర్చకులు, ఆలయాధికారులు, భక్తులు

యాదగిరిగుట్టపై పెండింగ్ పనుల పరిశీలన



లక్ష్మీ పుష్కరిణిని పరిశీలిస్తున్న అధికారులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా కొండ దిగువన పెండింగ్‌లో ఉన్న పనులను ఆర్అండ్‌బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ వసంత్‌నాయక్ సోమవారం పరిశీలించారు. ఇటీవల ఆలయాన్ని సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్ పనులపై దృష్టి పెట్టాలని, ఆ పనులకు సంబంధించి బడ్జెట్ వివరాలు సమర్పించాలని ఆదేశించారు. దీంతో సీఈ రాజేశ్వర్‌రెడ్డి, ఎస్ఈ వసంత్‌నాయక్ కొండ కింద నిలిచిపోయిన అన్న ప్రసాద భవనం, షాపింగ్ కాంప్లెక్స్, బస్టాండ్ వంటి పనులను పరిశీలించారు. అంతేకాకుండా పూర్తైన లక్ష్మీ పుష్కరిణి, దీక్షాపరుల మండపం, కల్యాణ కట్ట వంటి నిర్మాణాలను చూశారు. పెండింగ్ పనులకు ఎన్ని నిధులు అవసరం, ఇప్పటివరకు ఎంత మేరకు పనులు పూర్తయ్యాయి, ఇంకా ఎంత పని పెండింగ్‌లో ఉందనే అంశాలతో రిపోర్టు తయారు చేయనున్నట్లు వెల్ల డించారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక సమర్పించనున్నారు. వీరి వెంట వైటీడీఏ ఈఈ సునీల్, జేఈఈ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ జేఈఈ కరుణాకర్ తదితరులున్నారు.

ప్రభుత్వ బడిలో క్రీడా సామగ్రి దహనం చేసిన దుండగులు



కాలిబూడిదైన బ్యాట్లు, క్రీడా సామగ్రి

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ రోడ్డులో గల జేబీఎస్ ప్రభుత్వ పాఠశాల మద్యం, గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా మారింది. రోజూ ఉదయం పాఠశాల గేటు తీయగానే మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల గోడ దూకి రూ.60 వేల విలువైన క్రీడా సామగ్రిని పెట్రోల్ పోసి తగలబెట్టారు. పాఠశాలలో క్రీడా సామగ్రి ఉండటం వల్ల సాయంత్రం వరకు విద్యార్థులు అక్కడే ఆడుతున్నారు. ఇది గంజాయి బ్యాచ్‌కు అవరోధంగా మారింది. విద్యార్థులు స్కూల్ సమయం అయిపోగానే ఇంటికి పోతే ఇటు వైపు కన్నెత్తి చూడరని క్రీడా సామగ్రిని దగ్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆరు నెలల క్రితం కూడా ఇదే విధంగా క్రీడా సామగ్రిని దహనం చేశారు. అప్పట్లో భయపడిన పాఠశాల ఉపాధ్యాయులు ఎవరికీ ఫిర్యాదు చేయలేదు. ఇటీవల హైస్కూల్ సిబ్బంది మారడంతో గతంలో కూడా ఇలాగే జరిగిందని విద్యార్థులు ఉపాధ్యాయులకు చెప్పారు. దీంతో సోమవారం వన్‌టౌన్ పోలీసులకు అనుమానితుల వివరాలతో ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు.

అసభ్యంగా ప్రవర్తిస్తున్న గంజాయి బ్యాచ్..

హైస్కూల్ నుంచి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో గంజాయి బ్యాచ్ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. ఉపాధ్యాయులను సైతం సైగలతో బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. పోలీసుల నిఘా పెంచాలని విద్యార్థినులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర బీసీ కమిషన్ పర్యటన

భువనగిరిటౌన్: రాష్ట్ర బీసీ కమిషన్ మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పర్యటిస్తున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నల్లగొండ కలెక్టరేట్‌లో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, బీసీ సంఘం నాయకులు హాజరై ఫిర్యాదులను రాతపూర్వకంగా అందించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జాయింట్ సెక్రటరీ సక్రునాయక్, జోనల్ ఆఫీసర్ విద్యారాణి

రాజాపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జాయింట్ సెక్రటరీ బీ. సక్రునాయక్, జోనల్ ఆఫీసర్ విద్యారాణి అన్నారు. సోమవారం రాజాపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ జోనల్ స్థాయి క్రీడాపోటీలను వారు ప్రారంభించారు. మూడు రోజుల పాటు అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో 9 రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13 పాఠశాలల నుంచి 1105 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీ. జగదీశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, క్రీడల సమన్వయకర్త జీ. శ్రీనివాస్, పీడీ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకు త్రిఫ్ట్ డబ్బులు వెంటనే ఇవ్వాలి

- రాష్ట్ర చేనేత జౌళి శాఖ రీజినల్ డైరెక్టర్ పద్మ



రాష్ట్ర చేనేత జౌళిశాఖ రీజినల్ డైరెక్టర్ పద్మను సన్మానించిన చేనేత నాయకులు

భూదాన్‌పోచంపల్లి: చేనేత కార్మికుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిన త్రిఫ్ట్ డబ్బులను డ్రా చేసుకొనేందుకు అవకాశం కల్పించాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ రీజినల్ డైరెక్టర్ పద్మ అన్నారు. సోమవారం చేనేత జౌళిశాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ ఆదేశాల మేరకు ఆమె పోచంపల్లిని సందర్శించారు. చేనేత సహకార సంఘం, చేనేత కార్మికుల సంఘంలో చేనేత కార్మికులతో సమావేశమై వారు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కాగా గతంలో ముద్ర రుణాలు తీసుకొని బకాయిలు ఉన్న చేనేత కార్మికులకు త్రిఫ్ట్ డబ్బులు డ్రా చేసుకోకుండా బ్యాంకర్లు నిలుపుదల చేశారని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆమె స్పందిస్తూ స్థానిక ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, కెనరా బ్యాంకులను సందర్శించి ఆయా బ్యాంకుల మేనేజర్లతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్రిఫ్ట్ డబ్బులు పట్టుకోవడానికి వీలులేదని, వెంటనే డబ్బులు డ్రా చేసుకొనే అవకాశం కల్పించాలని కోరారు. మొదటిసారిగా పోచంపల్లికి వచ్చిన ఆమెకు పద్మశాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, పాలకవర్గం శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళిశాఖ ఇన్‌చార్జి ఏడీ శ్రీనివాస్, చేనేత సహకార సంఘం మేనేజర్ రుద్ర అంజనేయులు, చింతకింది రమేశ్, ఏలే భిక్షపతి, చేనేత కార్మిక సంఘం పాలకవర్గం భరత్ భూషణ్, బొమ్మ హరిశంకర్, బిట్ల గణేశ్, రుద్ర సూర్యప్రకాశ్, పొట్టబత్తిని వేణు, కటకం శ్యామ్, కూరపాటి భాస్కర్, గుండేటి శివరాజ్, గుండు రాజేశ్వరి, గుర్రం హేమలత తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఫర్నిచర్ షాపు దగ్ధం

- కాలిబూడిదైన సామగ్రి



దగ్ధమవుతున్న ఫర్నిచర్ షాపు



కాలిబూడిదైన షాపు

భూదాన్‌పోచంపల్లి: షార్ట్ సర్క్యూట్‌తో ఫర్నిచర్ షాపు దగ్ధమైంది. ఈ ఘటన పోచంపల్లి పట్టణ కేంద్రంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి పట్టణ కేంద్రానికి చెందిన ధ్యానమైన జంగయ్య స్థానికంగా రెండు షట్టర్లలో శ్రీసాయి మెటల్ అండ్ ఫర్నీచర్ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం 10 గంటలకు షాపు తెరిచాడు. ఫర్నిచర్ ఉన్న షాపులో షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు అలుముకోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు స్థానిక పెట్రోల్ బంక్‌ల నుంచి కార్బన్ డై ఆక్సైడ్ సిలిండర్లు తెచ్చి మంటలార్పేందుకు యత్నించారు. చౌటుప్పల్‌లోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలార్పారు. అప్పటికే షాపులోని మంచాలు, స్పాంజ్ బెడ్‌లు, బీరువాలు, ప్లాస్టిక్ కుర్చీలు, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. రూ.3లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. విషయం తెలుసుకొన్న తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఆర్ఐ వెంకట్‌రెడ్డి తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకొన్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు జంగయ్య అధికారులను కోరారు.

రేవనపల్లిలో జ్యువెల్లరీ షాపులో..



మంటలు అంటుకున్న సిలిండర్‌ను రోడ్డుపై పడేసిన స్థానికులు

పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లిలో గల మణికంఠ జ్యువెల్లరీ షాపులో సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. షాపు యజమాని అఖిల్‌చారి వెండి వస్తువులను కరిగించేందుకు గాను షాపులో ఉన్న చిన్న సిలిండర్‌ను వెలిగించాడు. సిలిండర్ పైపు చెడిపోయి ఉండటంతో ఒక్కసారిగా మంటలు సిలిండర్‌కు అంటుకున్నాయి. వెంటనే అప్రమత్తమైన అఖిల్‌చారి ఇరుగుపొరుగు వారిని పిలిచాడు. వారు సిలిండర్‌ను బయటకు విసిరివేయడంతో పెనుప్రమాదం తప్పింది. షాపులోని రెండు డెస్క్ టేబుల్స్, కుర్చీలు, కార్పెట్, షాపు షోకేజ్ గ్లాస్ పగిలిపోయింది. సుమారు రూ.30వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.